

మనం

కడప | అన్నమయ్య



నాగవరంలో కూటమి నేతల ఎన్నికల ప్రచార జోరు

వివరాలు 5లో

రాజంపేటలో దోస్తీ ఖతమ్.. కుస్తీ షురూ!



భగ్గుమన్న కూటమి కుంపటి!

స్నేహం పైపైనే.. సమరం నేరుగానే!

చమర్తి వర్సెస్ యల్లటూరు ఆధిపత్యంతో రచ్చకెక్కిన పొత్తు!

కూటమి ధర్మం గంగార్పణం: రాజంపేటలో 'ఫ్రెండ్లీ ఫైట్' కాదు.. 'ఫుల్ టైమ్ వార్'!

టీడీపీ జం జనసేన కయ్యంతో దద్దరిల్లుతున్న రాజకీయం!

రాజుల పోరుతో రగిలిన రాజంపేట

మిత్రపక్షాల ముఖాముఖి పోరు..

అధికారం కోసం నిలువునా చీలిపోయిన కూటమి!

మిత్రపక్షాల ముసుగులో ముదిరిన సమరం!

మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 1

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఐక్యతా రాగం ఆలపిస్తుంటే, అన్నమయ్య జిల్లా రాజంపేట పురపాలక ఎన్నికల రాజకీయం మాత్రం భిన్నమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తోంది. మిత్రపక్షాలైన తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి ప్రత్యర్థులను ఢీకొట్టాల్సింది పోయి, స్థానిక స్థాయిలో అధినేతలు స్నేహహస్తం చాటుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం కూటమి ధర్మం గంగలో కలిసిపోయి ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా సాగుతోంది.

పలు వార్డుల్లో కూటమి భాగస్వామ్య పక్షాల నడుమ తలెత్తిన విభేదాలు చిలికి చిలికి గాలివానలా మారి చివరకు ప్రత్యక్ష పోటీకి దారితీశాయి. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలను చిత్తు చేయాల్సిన నేతలు, తమ అంతర్గత ఆధిపత్య పోరుకే సమయం కేటాయించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకవైపు టీడీపీ అధికారిక అభ్యర్థులకు జనసేన మద్దతుదారులు సవాల్ విసురుతుంటే, మరికొన్ని వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థుల రూపంలో అసమ్మతి సెగలు తారస్థాయికి చేరాయి.

అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి ప్రచారం వరకు అడుగడుగునా సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నాయకుల వ్యక్తిగత ప్రతిష్టలు, గ్రూపు రాజకీయాలు పార్టీల పొత్తు మార్గదర్శకాలను తుంగలో తొక్కడంతో రాజంపేట పురపోరు రాష్ట్ర స్థాయి పరిశీలకుల దృష్టిని సైతం ఆకర్షిస్తోంది.

"జగన్‌మోహన్‌రాజు వర్సెస్ శ్రీనివాసరాజు: ఆధిపత్య పోరుకు పరాకాష్ట

రాజంపేట రాజకీయాల్లో ప్రస్తుతం సాగుతున్న సమరం కేవలం మున్సిపల్ ఎన్నికలకే పరిమితం కాలేదు. ఇది స్థానిక ముఖ్య నేతలైన చమర్తి జగన్‌మోహన్‌రాజు, యల్లటూరు శ్రీనివాసరాజు మధ్య సాగుతున్న ఆధిపత్య పోరుకు వేదికగా మారింది. నియోజకవర్గంలో పట్టు నిలుపుకునేందుకు ఇరు వర్గాలు తమ అనుయాయులను బరిలోకి దించి బలప్రదర్శనకు దిగడంతో, క్షేత్రస్థాయి కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది.

వార్డుల్లో ప్రత్యక్ష తలపడటం: టీడీపీ వర్సెస్ జనసేన పొత్తు ధర్మానికి తిలోదకాలు ఇస్తూ

22వ వార్డు సమరం: ఇక్కడ టీడీపీ మద్దతుతో గుగ్గిళ్ల చంద్రమౌళి బరిలో ఉండగా, జనసేన శ్రేణుల పూర్తి మద్దతుతో రేణాటి రాఘవేంద్రవర్మ స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగి సవాల్ విసురుతున్నారు.

29వ వార్డులో రసవత్తర పోరు: ఇక్కడ కూడా టీడీపీ, జనసేన వర్గాల మధ్య తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది.

స్వతంత్రుల సవాళ్లు: మరికొన్ని వార్డుల్లో టీడీపీ అధికారిక అభ్యర్థులపై స్వతంత్రులుగా తిరుగుబాటుదారులు రంగంలోకి దిగడంతో పోటీ హోరాహోరీగా మారింది.

సమన్వయ లోపం.. గందరగోళంలో కేడర్

కూటమి శ్రేణులు కలిసికట్టుగా ప్రచారం చేయాల్సిన చోట ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. నామినేషన్ల ఘట్టం నుంచి నేటి ప్రచారం వరకు ఉమ్మడి కార్యాచరణ అన్న మాటే కనిపించలేదు. ఏ నాయకుడు ఎవరి పక్షాన ఉన్నారో, ఏ అభ్యర్థికి ఓటెయ్యాలో తెలియక కూటమి సానుభూతిపరులు అయోమయానికి గురవుతున్నారు.

భవిష్యత్ రాజకీయాలపై తీవ్ర ప్రభావం


ఈ స్థానిక పోరు కేవలం ప్రస్తుత ఎన్నికలతోనే ముగిసిపోదని, రాబోయే రోజుల్లో కూటమి సంబంధాలపై తీవ్రమైన నెగెటివ్ ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పోలింగ్ ముగిసి ఫలితాలు వెలువడిన తర్వాత ఈ అంతర్గత విభేదాలు మరింతగా ముదిరి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి కూటమి ఐక్యతకే ప్రమాదకరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓట్ల కోసం వేర్వేరు దారులు.. అధికారం కోసం ఎవరికి వారే పోరు.. ఫలితాల తర్వాతైనా కూటమి నాయకులు ఒక్కటవుతారా?

పోరు ముగిసింది.. తీర్పు బాక్సుల్లో భద్రం!

పుర పోలింగ్ 70.06 శాతం నమోదు

బద్వేలులో ఓటర్ల వెల్లువ.. రాజంపేటలో చప్పగా సాగిన వైనం

పురుషులే ముందంజ.. మహిళల్లో తగ్గిన ఉత్సాహం



మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 1

పట్టణాల్లో ఓటరు నాడి తేలిపోయింది. ఉత్కంఠ రేపిన స్థానిక సమరం ముగిసింది. వైఎస్సార్ జిల్లా పరిధిలోని పురపాలికలు, నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆదివారం ముగిసింది. మొత్తం 7 పట్టణ స్థానిక సంస్థల్లోని (యూఎల్‌బీ) 172 వార్డుల్లో ప్రజలు తమ తీర్పును బ్యాలెట్/ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా సగటున 70.06 శాతం మేర ఓటింగ్ నమోదైంది. మొత్తం 4,39,035 మంది ఓటర్లుండగా.. 3,07,594 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. దాదాపు 1.31 లక్షల మంది ఓటింగ్‌కు దూరంగా ఉండటం గమనార్హం.

అక్కడ జోరు.. ఇక్కడ బేజారు!

ఎన్నికల బరిలో నిలిచిన పురపాలికల్లో ఓటర్ల స్పందన మిశ్రమంగా కనిపించింది. బద్వేలు టాప్: బద్వేలులో ఒక వార్డుకు జరిగిన ఎన్నికలో ఓటర్లు పోటెత్తారు. ఏకంగా 80.30 శాతంతో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ మహిళలు (81.6%) చైతన్యం చూపి పురుషుల (79.1%) కంటే ఎక్కువ శాతం ఓటేయడం విశేషం.

జమ్మలమడుగులో హోరాహోరీ: తీవ్ర పోటీ నెలకొన్న జమ్మలమడుగు మున్సిపాలిటీలోని 32 వార్డుల్లో ఓటర్లు భారీగా తరలివచ్చారు. ఇక్కడ 78.50 శాతం ఓటింగ్ నమోదైంది. రాజంపేటలో నిరాసక్తత: రాజంపేటలోని 17 వార్డుల్లో ఓటర్ల నుంచి ఆశించిన స్పందన రాలేదు. జిల్లాలోనే అత్యల్పంగా కేవలం 58.30 శాతం మాత్రమే ఓటింగ్ నమోదై చివరి స్థానంలో నిలిచింది.

పురుషులదే పైచేయి

జిల్లా వ్యాప్తంగా చూస్తే మహిళల కంటే పురుషులే అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పురుషుల ఓటింగ్ 74.21 శాతంగా నమోదు కాగా, మహిళల ఓటింగ్ 67.26 శాతానికే పరిమితమైంది. ఇతర ఓటర్లు 2.0 శాతం మంది ఓటేశారు.

పురపాలికల వారీగా ఓటింగ్ సరళి:

ఎర్రగుంట్ల: 73.70% (1 వార్డు)

మైదుకూరు: 72.10% (15 వార్డులు)

పులివెందుల: 70.60% (40 వార్డులు)

కడప కార్పొరేషన్: 69.47% (66 డివిజన్లు, మొత్తం పోలైన ఓట్లు: 2,13,323)

పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ పెట్టెల్లో భద్రమైంది. ఫలితాలపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ప్రచార వాహనాల అనుమతులకు సింగిల్ విండో డెస్క్ ఏర్పాటు

అభ్యర్థులు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.జయభరత్ రెడ్డి



చిట్వేలీ నవంబర్ 1 మనం న్యూస్: చిట్వేలి మండల పరిధిలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ-2026 ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార వాహనాలకు అనుమతులు మంజూరు చేసేందుకు చిట్వేలి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.జయభరత్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.
ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ఎన్నికల ప్రచారానికి వినియోగించే వాహనాలకు ముందస్తుగా అనుమతులు పొందాలని ఆయన సూచించారు. ఇందుకోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సింగిల్ విండో డెస్క్‌ను సంప్రదించి, తహసీల్దార్ ద్వారా అవసరమైన అనుమతులు తీసుకోవాలని తెలిపారు.అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారానికి వాహనాలను వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు చేపడుతున్న చర్యలకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని రిటర్నింగ్ అధికారి జి.జయభరత్ రెడ్డి కోరారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోండి

నవంబర్ 2న పుల్లంపేట ఎంపీడీవో కార్యాలయంలో

ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

పుల్లంపేట, నవంబర్ 1 (మనం న్యూస్)తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో ఓటు హక్కు కలిగి ఉండి, ఇతర మండలాల్లో ఎన్నికల విధులకు హాజరుకానున్న అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నవంబర్ 2వ తేదీన మండల ప్రజా పరిషత్కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరభద్రారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.ఈ కేంద్రం నవంబర్ 2వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులు తమ ఎన్నికల విధులకు సంబంధించిన జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు, ఓటరు గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తీసుకువచ్చి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు





పులివెందుల పోరులో హైటెన్షన్

వాహనాల దహనం, ఘర్షణలు.. రీపోలింగ్‌కు జగన్ డిమాండ్, ఓటేయకుండానే బెంగళూరు పయనం!

మనం ప్రతినిధి కడప

రాయలసీమ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పులివెందుల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ తీవ్ర ఉద్రిక్తతల నడుమ రణరంగాన్ని తలపించింది. పోలింగ్‌కు ముందు అర్ధరాత్రి జరిగిన వాహనాల దహనం మొదలుకుని, ఉదయం పోలింగ్ బూత్‌ల వద్ద తోపులాటలు, నేతల గృహనిర్బంధాలు, ఆర్వో కార్యాలయం వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధర్నా వరకు వరుస పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించాయి.

అర్ధరాత్రి వాహనాల దహనం.. కలకలం

పోలింగ్‌కు కొన్ని గంటల ముందు ఉలిమెల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలకు నిప్పంటించారు. ఈ ఘటనలో 3 కార్లు, 11 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ దహనకాండతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురికాగా, నియోజకవర్గంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

బూత్‌ల వద్ద ఉద్రిక్తతలు.. రాళ్ల దాడి, కర్రల వివాదం

ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైన వెంటనే టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య పలుచోట్ల ఘర్షణలు చెలరేగాయి:

పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఇరువర్గాలు రాళ్లు రువ్వుకోగా పోలీసులు లాఠీలతో చెదరగొట్టారు.

13వ వార్డులో కొందరు కర్రలు పంచుతున్నారంటూ వైఎస్సార్‌సీపీ వీడియోలు విడుదల చేయగా, 31వ వార్డులో తమ ఏజెంట్‌పై దాడి జరిగిందని ఆ పార్టీ ఆరోపించింది.

ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద కొందరు మహిళలు కర్రలతో రావడంతో అడ్డుకున్నామని పోలీసులు తెలపగా, ఓటు వేసేందుకు వచ్చిన తమను అకారణంగా అడ్డుకున్నారని మహిళలు ఆరోపించారు.

బీటెక్ రవి గృహనిర్బంధం.. 1000 మంది పోలీసుల పహారా

శాంతిభద్రతల దృష్ట్యా టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవిని పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు 1,000 మంది పోలీసులను మోహరించి, సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు.



ఆర్వో కార్యాలయం వద్ద నిరసన.. అవినాష్ రెడ్డి, జగన్ రాక

వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించడం లేదని ఆరోపిస్తూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పార్టీ ఏజెంట్లతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్వో గదికి తాళం వేసి ఉండటంతో బయటే నిరీక్షించారు.

అనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని, పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లతో కలిసి అక్కడే బైఠాయించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్వో శ్రీనివాస్, ఆర్డీవో చిన్నయ్యలతో మాట్లాడి ఎన్నికల ప్రక్రియ సాగుతున్న తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

"న్యాయంగా రీపోలింగ్ పెడితేనే ఓటు వేస్తా".. జగన్ సంచలన నిర్ణయం

పులివెందులలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండానే ఏకపక్షంగా పోలింగ్ జరుపుతున్నారని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు.

"ఇప్పుడున్న పరిస్థితుల్లో నేను వెళ్లి ఓటేస్తే అంతా సవ్యంగానే జరుగుతోందనే తప్పుడు సంకేతం వెళ్తుంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నాను. ధర్మబద్ధంగా, న్యాయమైన పద్ధతిలో రీపోలింగ్ నిర్వహిస్తేనే వచ్చి నా ఓటు హక్కును వినియోగించుకుంటా" అని జగన్ స్పష్టం చేశారు.

నిరసన అనంతరం ఆయన ఓటు వేయకుండానే నేరుగా హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

స్థానిక వార్డు స్థాయి ఎన్నికగా మొదలైన పులివెందుల మున్సిపల్ పోరు.. అర్ధరాత్రి దహనకాండ, పరస్పర దాడులు, మాజీ సీఎం ధర్నా మరియు ఓటింగ్ బహిష్కరణతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



నాలుగు దశాబ్దాల రాజకీయ అనుబంధం

నాడు వైఎస్సార్ ప్రోత్సాహం..నేడు జెడ్పీటీసీ అభ్యర్థిగా ఎల్.వీ.మోహన్ రెడ్డి

చిట్వేలీ నవంబర్ 1 మనం న్యూస్: రాజకీయాల్లోకి రావాలంటే పదవులు, పలుకుబడి మాత్రమే కాదు.. ప్రజలతో అనుబంధం, రాజకీయాలపై ఆసక్తి, నిరంతర ప్రయాణం అవసరం. ఈ నేపథ్యంలో చిన్న వయసులోనే రాజకీయాలపై ఆసక్తి పెంచుకుని, గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న నాయకుడు ఎల్.వి.మోహన్ రెడ్డి నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రోత్సాహంతో ఎన్నికల రాజకీయాల్లో కీలక అడుగు వేసిన ఆయన, నేడు 2026 స్థానిక సంస్థల ఎన్నికల్లో చిట్వేల్ జెడ్పీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిచారు.

20 ఏళ్ల వయసులోనే రాజకీయ అరంగేట్రం

మోహన్ రెడ్డి తన 20 ఏళ్ల వయసులోనే రాజకీయాలపై ఆసక్తితో చురుగ్గా వ్యవహరించడం ప్రారంభించారు. 1987లో జరిగిన తొలి మండల పరిషత్ ఎన్నికల సమయంలో తన బావగారైన నాగిరెడ్డి నరసింహారెడ్డి ఎంపీపీగా ఎన్నికవడంలో కీలకంగా పనిచేశారు. అప్పటి నుంచి చిట్వేలీ మండల రాజకీయాలతో ఆయనకు అనుబంధం ఏర్పడింది. కాలక్రమేణా గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు రాజకీయ పరిణామాల్లో భాగస్వామిగా కొనసాగారు.

వైఎస్సార్ పిలుపుతో 2001లో కీలక మలుపు

మోహన్ రెడ్డి రాజకీయ జీవితంలో 2001 సంవత్సరం ప్రత్యేక గుర్తింపును సంతరించుకుంది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసేందుకు నాయకులు



ముందుకు రావడానికి వెనుకాడుతున్న పరిస్థితులు ఉన్నాయని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

ఈ సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు వైఎస్ రాజశేఖర రెడ్డి కడప గెస్ట్‌హౌస్‌కు మోహన్ రెడ్డిని స్వయంగా పిలిపించి, చిట్వేల్ మండల రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని, ఎంపీపీ ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించినట్లు ఆయన అనుచరులు గుర్తుచేస్తున్నారు. వైఎస్సార్ ఇచ్చిన ప్రోత్సాహం మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపుగా నిలిచింది.

2001లో దేవమాచుపల్లి సర్పంచ్‌గా ఏకగ్రీవం

వైఎస్సార్ ప్రోత్సాహంతో రాజకీయాల్లో మరింత చురుకైన పాత్ర పోషించిన మోహన్ రెడ్డి, అదే ఏడాది దేవమాచుపల్లి గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామస్థాయి ప్రజాప్రతినిధిగా తన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక అడుగు వేశారు.

2005లో ఎంపీపీగా సతీమణి ఎన్నిక

2005లో మోహన్ రెడ్డి సతీమణి చిట్వేలీ మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. దీంతో మండల పరిషత్ రాజకీయాల్లో వారి కుటుంబ ప్రాతినిధ్యం కొనసాగింది.

తల్లి పార్వతమ్మ రెండుసార్లు సర్పంచ్

మోహన్ రెడ్డి తల్లి లేబాకు పార్వతమ్మ సైతం స్థానిక రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. 2006, 2012 సంవత్సరాల్లో దేవమాచుపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. ఇలా కుటుంబంలోని పలువురు స్థానిక రాజకీయాల్లో వివిధ హోదాల్లో ప్రజాప్రతినిధులుగా వ్యవహరించడం విశేషం.

2021లో మరోసారి సర్పంచ్‌గా ఎన్నిక

సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో భాగంగా 2021లో మోహన్ రెడ్డి మరోసారి దేవమాచుపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అదే ఏడాది చిట్వేల్ మండల ఎంపీపీ స్థానం ఎస్సీలకు రిజర్వ్ కావడంతో ఆయన అనుచరుడైన టంగుటూరు చంద్ర ఎంపీపీగా ఎన్నికయ్యారు.

25 ఏళ్ల తర్వాత జెడ్పీటీసీ ఎన్నికల బరిలోకి



2001లో వైఎస్సార్ ప్రోత్సాహంతో ఎన్నికల రాజకీయాల్లోకి కీలకంగా అడుగుపెట్టిన ఎల్.వి.మోహన్ రెడ్డి, సుమారు 25 ఏళ్ల తర్వాత ఇప్పుడు చిట్వేలీ జెడ్పీటీసీ ఎన్నికల బరిలో నిలవడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన అనుభవం, మండల రాజకీయాలతో సుదీర్ఘ అనుబంధం, స్థానిక ఎన్నికల్లో పాల్గొన్న అనుభవంతో జెడ్పీటీసీ అభ్యర్థిగా ప్రజల ముందుకు వచ్చారు.

నాడు వైఎస్సార్ పిలుపుతో ప్రారంభమైన ఎన్నికల ప్రస్థానం.. నేడు జెడ్పీటీసీ ఎన్నికల వరకు చేరుకుంది. గ్రామస్థాయి రాజకీయాల నుంచి మండల స్థాయి రాజకీయాల వరకు సాగిన ఎల్.వి.మోహన్ రెడ్డి ప్రయాణంలో 2026 జెడ్పీటీసీ ఎన్నికలు మరో ముఖ్యమైన అధ్యాయంగా నిలవనున్నాయి.

శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయ సాధనే మనందరి కర్తవ్యం

రైల్వే కోడూరులో ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు





రైల్వే కోడూరు, నవంబర్ 1, మనం న్యూస్
ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రైల్వే కోడూరు పట్టణంలో శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములుకి ఘన నివాళులు అర్పించారు. రైల్వే కోడూరు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా మరియు స్ఫూర్తిదాయకంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం సందర్భంగా పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు గారి విగ్రహం వద్దకు చేరుకొని అనంతరం ఆయన విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి, భక్తిశ్రద్ధలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన మహానుభావుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన చేసిన ఆమరణ నిరాహార దీక్ష మన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. నేటి యువత మరియు భావితరాలు ఆయన త్యాగాన్ని, దేశభక్తిని, పట్టుదలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, యువజన సంఘం ప్రతినిధులు, పట్టణ వాసులు పాల్గొని శ్రీ పొట్టి శ్రీరాములు గారికి తమ నివాళులు అర్పించారు. కార్యక్రమం అంతటా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అమర్ రహే అంటూ నినాదాలు మార్మోగాయి.

నాగవరంలో కూటమి నేతల ఎన్నికల ప్రచార జోరు

ప్రచారంలో పాల్గొన్న టీడీపీ జిల్లా ఎన్నికల ఇంచార్జ్ నూకసాని బాలాజీ, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానంద రెడ్డి





చిట్వేలీ నవంబర్ 1 మనం న్యూస్: చిట్వేలి మండలం నాగవరం గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి నూకసాని బాలాజీ, రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు.
కూటమి బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థి పంతగాని నరసింహులు, చిట్వేలు జెడ్పీటీసీ అభ్యర్థి ఆనాల సునీల్ కుమార్‌కు మద్దతుగా నాయకులు గ్రామంలో పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా నియోజకవర్గంలో జరగని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల వ్యవధిలో చేసి చూపించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఎన్నికల ప్రచారం నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ముఖ్య నాయకుల హాజరు

ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర చైర్మన్ కేకే చౌదరి, టీడీపీ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతంగాని నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కూటమి పార్టీలకు చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాగవరం గ్రామంలో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంతో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది.

కేఎస్.అగ్రహారంలో పాటూరు శ్రీనివాసులురెడ్డి విస్తృత ప్రచారం

అభ్యర్థి పాటూరు సుమలతకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన ముక్కా, కస్తూరి, కేకే, మాచినేని

తిరుపతి జిల్లా, రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలి మండలం కేఎస్.అగ్రహారంలో ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. తెలుగుదేశం పార్టీ మద్దతుతో ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాటూరు సుమలత గారి తరపున ఆమె భర్త, టీడీపీ సీనియర్ నాయకులు పాటూరు శ్రీనివాసులు రెడ్డి గారు కేఎస్.అగ్రహారంలో ఆదివారం ముఖ్య నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమానికి రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు ముక్కా రూపానంద రెడ్డి, మాజీ ఇంచార్జ్ కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర చైర్మన్ కేకే చౌదరి, టిడిపి నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు తదితర ముఖ్య నాయకులు హాజరై పాటూరు కుటుంబానికి



తమ మద్దతు ప్రకటించారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుని ఎంపీటీసీ అభ్యర్థి పాటూరు సుమలత గారికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేఎస్.అగ్రహారం పంచాయతీ అభివృద్ధికి సమష్టి కృషి అవసరమని, ప్రజల సమస్యలను గుర్తించి వాటి



పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలో నిలిచిన పాటూరు సుమలతకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మమేకమవుతూ సాగిన ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలువురు



కూటమి నేతలు, స్థానిక కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకుల రాకతో గ్రామంలో ఎన్నికల ప్రచారం మరింత సందడిగా సాగింది.



పుంగనూరు మున్సిపల్ ఎన్నికలు

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్.. సాయంత్రం 5:30 గంటల వరకు 63.47 శాతం నమోదు

మనం ప్రతినిధి, అన్నమయ్య నవంబర్1: అన్నమయ్య జిల్లా పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని 4 వార్డులకు సంబంధించి నిర్వహించిన సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆదివారం ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారులు పటిష్ట బందోబస్తు, పర్యవేక్షణ మధ్య పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించారు.

సాయంత్రం 5:30 గంటల సమయానికి పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికల అధికారి మరియు కమిషనర్ విడుదల చేసిన తుది నివేదిక ప్రకారం మొత్తం 63.47 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికలు జరిగిన 4 వార్డుల్లో మొత్తం 5,073 మంది ఓటర్లు ఉండగా, వారిలో 3,220 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారికంగా వెల్లడించారు. సాయంత్రం 5:00 గంటలకు పోలింగ్ సమయం ముగిసినప్పటికీ, ఆ సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించి 5:30 గంటల సమయానికి పోలింగ్ శాతాన్ని ఖరారు చేశారు. పోలింగ్ ముగియడంతో అధికారులు ఈవీఎంలు/బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి, పటిష్ట భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే ప్రక్రియను పూర్తి చేశారు.

ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక అవకాశం

చిట్వేలి నవంబర్ 1 మనం న్యూస్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులకు కేటాయించబడిన ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేందుకు తిరుపతి జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 2వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల విధులకు కేటాయించబడిన ఉపాధ్యాయులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు.

ఉపాధ్యాయులకు ముఖ్య సూచనలు

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే ఉపాధ్యాయులకు నవంబర్ 2వ తేదీన ఓడీ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే ఉపాధ్యాయులు తప్పనిసరిగా (లీప్) యాప్‌లో తమ వివరాలను ఎలక్షన్ డ్యూటీగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు కేటాయించబడిన ఉపాధ్యాయులందరూ నిర్ణీత సమయంలో సంబంధిత కేంద్రాలకు చేరుకుని పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కోరారు.

ఎన్నికల విధుల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం

చిట్వేలి మనం న్యూస్: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులకు నియమించబడిన అర్హులైన సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేం దుకు చిట్వేలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు మండల రిటర్నింగ్ అధికారి జి. జయభరత్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వుల మేరకు నవంబర్ 2వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.ఎన్నికల విధులకు నియమించబడిన పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులైన సిబ్బంది నిర్ణీత తేదీ, సమయాల్లో చిట్వేలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి హాజరై తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని అధికారులు సూచించారు.